క్లుప్తంగా

జాతీయ రహదారి పనులు అడ్డగింత

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో కోదాడ–కురవి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రామచంద్రాపురంకు వెళ్లే రహదారిలో సైడ్ డ్రైయిన్ నిర్మాణం చేపట్టకుండా జాప్యం చేస్తున్నారు. దీంతోశుక్రవారం గ్రామస్తులు పనులు అడ్డగించి ఆందోళన చేపట్టారు. గతంలో ఉన్న డ్రైయినేజీని తొలిగించి మరలా నిర్మించక పోవడంతో పనులను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న సంబంధిత కంపెనీ నిర్వాహకులు ఘటనా స్థలానికి చేరుకుని త్వరలోనే డ్రైయినేజీ పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కొమరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం

ఖమ్మంరూరల్: భూమి కోసం, భుక్తి కోసం ఈ దేశ ప్రజల విముక్తి కోసం పోరాడినతెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమరయ్య వారసత్వాన్ని కొనసాగించడానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన కొమరయ్య 78వ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు కె.మోహన్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.నాగేశ్వరరావు, వెంకటప్పారావు, వసుమతి, మమత, కోటయ్య, ఎం. బాబు, రామయ్య పాల్గొన్నారు.

సీఐటీయూలో పలువురి చేరిక



కమిటీలో చేరిన వారితో సంఘం నేతలు

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని విద్యుత్ షెడ్‌లో పనిచేస్తున్న పలువురు కార్మికులు తమ యూనియన్‌లో చేరినట్లు యూఈఈయూ(యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి ఎం.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, విద్యుత్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు బి.పుష్పరాణి, కామినేని నాగేశ్వరరావు, నల్లమోతు సీతయ్య తదితరులు పాల్గొనగా.. నూతనంగా చేరిన కార్మికులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా కె.రాజశేఖర్, కార్యదర్శిగా దావూద్, గౌరవ సలహాదారులుగా భూక్యా శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, కోటయ్య, ఖరీమ్, ఉపేందర్ తదితరులు ఎంపికయ్యారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కామేపల్లి: పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన అన్నారు. శుక్రవారం ఊట్కూర్ ఊటవాగు గుట్టపై నివాసమున్న గొత్తికోయలకు పీహెచ్‌సీ ఆధ్వర్యాన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు అందించాలి

కామేపల్లి: మండలంలోని నెమలిపురి గ్రామంలో 2018 సంవత్సరంలో మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించుకున్న 17 మంది లబ్ధిదారులకు బిల్లులు వెంటనే చెల్లించాలని శుక్రవారం జీపీ కార్యాలయం లబ్ధిదారులు ఎదుట ఆందోళన చేపట్టారు. బిల్లులు మంజూరైనా జీపీ కార్యదర్శి అక్రమంగా ఆ నిధులను మరో ఖాతాకు మళ్లించాడని, ఫించన్ మంజూరు చేయిస్తానని, కల్యాణలక్ష్మి లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడంటూ ఆరోపించారు. ఈ విషయాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు ఎంపీడీఓ రవీందర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.దీంతోవిచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

వనపర్తి కలెక్టర్‌ను ఆశీర్వదించిన మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేసి వనపర్తి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిన ఆదర్శ్ సురభిని మేయర్ పునుకొల్లు నీరజ ఆశీర్వదించారు. ఈ నెల 6న ఆదర్శ్ సురభి వివాహ వేడుకను పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి అక్షింతలు వేసి మేయర్ ఆశీర్వదించారు.

సంతాపం..

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఖమ్మం డిపోకు చెందిన ఉద్యోగి అయినాల రాంబాబు మృతి చెందగా డిపో మేనేజర్ శ్రీనివాస్ నగరంలోని మృతుడి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంతిమ ఖర్చుల కోసం ఆర్టీసీ తరపున కుటుంబసభ్యులకు రూ.20 వేలు అందజేశారు. ఖమ్మం డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆర్.రామయ్య, డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆకుతోట శ్రీనివాసరావు, ఏడీసీ మిరియాల వెంకటేశ్వర్లుతో పాటు ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు, తోకల బాబు, గుగ్గిళ్ల రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ అవకతవకలపై విచారణ చేపట్టాలి

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు రెవెన్యూ పరిధిలో సీతారామ ప్రాజెక్టు కాలువ కోసం సేకరించిన భూముల పరిహారంలో అక్రమాలు జరగాయని ఆరోపిస్తూ బీరోలు గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. భూములు కోల్పోయిన రైతులలో కొందరికే పరిహారం అందిందని, సేకరించిన భూముల్లో మూడు వ్యవసాయ బావులు ఉండగా.. ఏడుగురు రైతుల పేరిట రూ.1.36 కోట్లు చెల్లించారని ఇందులో స్ట్రక్చర్స్ గుర్తించేందుకు నియమించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల పాత్ర ఉందని ఆరోపించారు. పరిహారం పొందిన రైతులకు రైతుబంధు కూడా వస్తుందని ఫిర్యాదులో విన్నవించారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కొప్పుల రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

భూకబ్జా చేశారని ఫిర్యాదు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో భూకబ్జా చేయడమే కాక అక్రమ నిర్మాణం చేపట్టారని వివిధ సంఘాల నాయకుల శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు మాట్లాడుతూ..ఓ మహిళ స్థలాన్ని ఆక్రమించడమే కాక నిర్మాణం చేపట్టారని ఇదేమిటని అడిగితే దాడి చేశారని తెలిపారు. కేఎంసీ, పోలీసు అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేసిన నేపథ్యాన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రిటైర్డు సీఐ పుల్లూరు నాగయ్య, వివిధ సంఘాల నాయకులు బానోత్ భద్రునాయక్, విజయకుమార్, జంగిల్ రవి, షేక్ నజీమా, ఉపేంద్రబాయి, జ్యోతి, శ్రీనివాస్‌నాయక్, నాగేశ్వరావు, భాస్కర్, ప్రణయ్, చేపూరి పద్మ, నైనీషా, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమామిళ్లగూడెం: కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఫ్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు, పగిడికత్తుల రామదాస్‌లు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న జీపీ కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుని గత 6 నెలలకు పైగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 11న హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, జిల్లా నాయకులు శ్రీనివాస్, మీగడ సైదులు, నారాటి నాగేశ్వరరావు, గోసు పుల్లయ్య, శరత్, లాల్‌మియా, కత్తుల భిక్షం, కమల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

ఖమ్మం మామిళ్లగూడెం: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవాని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ గ్యారంటీలలో వికలాంగులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీవరత్నం, అంజయ్య, రాము, శ్రీను, సీతారాములు, సుజాత, భూలక్ష్మి, సురేష్, ఉపేందర్, సీహెచ్.శ్రీను, శివకుమార్, టి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐఎంఎల్(మాస్‌లైన్) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అధికారులను హెచ్చరించారు. శుక్రవారం సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన సందర్భంగా వారు మాట్లాడారు. చాలీచాలని జీతంతో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో వాళ్ల కుటుంబాలు గడవని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్‌పై, కార్మికుల సంస్యలు పరిష్కారం చేయని సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) డివిజన్ కార్యదర్శి జాన్సి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, ఐఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్యలతో పాటు కె.శ్రీను, వెంకటరమణ, మాతంగి అనిల్‌కుమార్, నెమలి కిషోర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఆర్థిక సాయం

రఘునాథపాలెం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని బూడిదంపాడు గ్రామవాసి కూరపాటి వెంకటరత్నం కుటుంబానికి గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ యూత్ గ్రూప్ సభ్యులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు చెందిన ఎవరైనా మరణిస్తే తమ వంతు సాయంగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు గ్రూప్ సభ్యులు తెలిపారు.

మెకానిక్‌కు..

ఖమ్మంఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల రోజులుగా ఇంటికే పరిమితమైన మెకానిక్ హుస్సేన్‌కు టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ బాధ్యులు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వంగాల కొండలరావుతో పాటు రమేష్, మురళి, శ్రీను, బ్రహ్మం, హరీష్, రాజు, శివరామకృష్ణ, శేషు, హరి, సుభానీ, అనిల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్‌కిడ్జ్'లో వన మహోత్సవం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా రహదారుల ఇరువైపులా పూల మొక్కలు, పండ్లనిచ్చే మొక్కలు, నీడ నిచ్చే మొక్కలు నాటారన్నారు. కాగా, గ్లోబల్ వార్మింగ్ ఇస్ గ్లోబల్ వార్నింగ్ అనే నినాదాలతో చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్వజ్ఞ విద్యార్థి ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లో ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్ష నిర్వహించగా.. గణిత శాస్త్ర విభాగంలో తమ పాఠశాల 5వ తరగతి విద్యార్థి అక్షయ రుత్విక్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ ఆర్‌వీ నాగేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణదీప్తి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

ఖమ్మంరూరల్: శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో మొక్కలు నాటారు. జూలై 6న శ్యాంప్రసాద్ ముఖర్జీ జన్మదినం సందర్భంగా బీజేపీ కార్యకర్తలు విరివిగా మొక్కలు నాటాలని ఆయన సూచించారు. కిరణ్, శ్యాం రాథోడ్, వెంకన్న, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఖమ్మంమామిళ్లగూడెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ కోరారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకుని శుక్రవారం పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. చావా కిరణ్, తాళ్లూరి సురేశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కామేపల్లి: ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి రాపర్తినగర్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రాపర్తినగర్, బీసీ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, రమణగుట్ట, దొరన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

అన్నదానం

ఖమ్మంఅర్బన్/కామేపల్లి: ఖమ్మం టూటౌన్ ఎస్సై జి.సూరజ్ తన పుట్టినరోజుసందర్భంగా శుక్రవారం అన్నం ఫౌండేషన్‌లో మానసిక దివ్యాంగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై దంపతులు సూరజ్–ప్రవలిక దివ్యాంగులకు సేవ చేస్తున్న అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావును ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో బానోతు ప్రమీల, శివాలాల్, చరణ్, రాంబాబు తదితరులు ఉన్నారు. అలాగే, యువజన కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నం సేవాశ్రమంలో అన్నదానం చేశారు. ఇక చరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను కామేపల్లిలో కూడా నిర్వహించగా కేక్ కట్ చేశారు. నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి కృష్ణారెడ్డి, కడవెండి వేణుగోపాల్, కేశవపట్నం శ్రీనివాసరావు, అమరేశ్వరరావు, గింజల నర్సింహారెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ ధనియాకుల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృతి

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ గేదె మృతి చెందింది. మండలంలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన వి.నారాయణకు చెందిన గేదె రోడ్డు దాటుతుండగా ఖమ్మం నుంచి కోదాడ వస్తున్న ఆర్టీసీ బస్ ఢీకొట్టింది. దీంతో గేదె అక్కడిక్కడే మృతి చెందగా.. బాధితుడు గేదె విలువ దాదాపు రూ.80 వేల వరకు ఉంటుందని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నేలకొండపల్లి: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని నాచేపల్లి శివారులో ఓ టీవీఎస్ బైక్‌పై మూడు బస్తాలు, ముజ్జుగూడెం శివారులో మరో టీవీఎస్‌పై ఇంకో బస్తాల మూడు బియ్యాన్ని శుక్రవారం ఏపీకి తరలిస్తుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు రెండు వాహనాలు, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని విచారిస్తున్నామని తెలిపారు.

ప్రతీ పంచాయతీలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి

నేలకొండపల్లి: వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తించే అవకాశమున్నందున దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అన్ని శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, మిషన్ భగీరథ డీఈఈ ఓంప్రకాష్ మాట్లాడారు. కాగా, గ్రామాల్లో బెల్ట్‌షాపుల వద్ద గ్లాసులు, సీసాలు పడేయడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నందున ఎక్సైజ్ అధికారులతో హెచ్చరికలు జారీ చేయించాలని పలువురు కార్యదర్శులు కోరారు. ఈ సమావేశంలో ఎంపీఓ శివ, వివిధ శాఖల ఉద్యోగులు ప్రసాద్, నరేష్, అరుణకుమారి, అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు ఇప్పించండి..

మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో బైరవునిపల్లి పంచాయతీ కార్యదర్శి కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయ్యాక వివిధ రకాల పనులు, నిర్వహణ నిమిత్తం అందిన కాడికి అప్పులు తెచ్చి పెడుతున్నామని తెలిపారు. అయితే, ఈ నగదు విషయం మాటెలా ఉన్నా ఏడు నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో పారిశుధ్య నిర్వహణ ఇబ్బంది అవుతుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు

పాడైన 'చెరువు'మాధారం రెగ్యులేటర్ షట్టర్లు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు రెగ్యులేటర్ షటర్లు, తూములు తప్పుపట్టి శిథిలావస్థకు చేరాయి. దీంతో చెరువు నీరంతా వృథాగా కిందకు పోతోంది. గతంలో చెరువు నీరు సగం ఖాళీ కావడానికి ఇదే ప్రథమ కారణమని రైతులు చెబుతున్నారు. వానాకాలం ప్రారంభమైనందున పడే చినుకు నిల్వ ఉంచాలంటే త్వరగా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈమేరకు శుక్రవారం చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, రైతు ప్రతినిధులు ధీరావత్ నాగేశ్వరరావు, తేజావత్ కోటేశ్వరరావు, డి.శ్రీను తదితరులు చెరువును సందర్శించి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈఈ మన్మథరావును వివరణ కోరగా.. షట్టర్లకు రబ్బర్ షీల్ వేసేందుకు జిల్లా అధికారుల అనుమతి కోరినట్లు తెలిపారు. రెగ్యులేటర్ వద్ద నీరు లీక్ కాకండా చూస్తామని పేర్కొన్నారు.



రెగ్యులేటర్ షట్టర్లను పరిశీలిస్తున్న రైతులు

మంత్రులను కలిసిన కేఎంసీ కమిషనర్





మంత్రులు తుమ్మల, పొంగులేటికి పుష్పగుచ్ఛాలు ఇస్తున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం వ్యవసాయం: రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రులను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేయగా, పలు అంశాలపై చర్చించారు. కాగా, ఖమ్మం నగరంలో మూసివేసిన రైతు బజార్లను తిరిగి తెరిపించాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ కల్వకుంట్ల గోపాల్‌రావు శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు..

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం సహకారనగర్: మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విధుల్లో చేరిన కలెక్టర్‌ను ఆయన సత్కరించారు. అలాగే, పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగనాథ్, మంజుల, నాయకులు రవికుమార్, రవి, మోత్కూరి గోపాలరావు, ఉదయ్‌ప్రతాప్, కీమానాయక్ తదితరులు కూడా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బ్యాగ్‌లు, నోట్ బుక్స్ పంపిణీ



బ్యాగ్ అందజేస్తున్న సత్యనారాయణ

ఖమ్మం అర్బన్: మండలంలోని దానవాయిగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 150 మంది విద్యార్థులకు శుక్రవారం రూ.2లక్షల విలువ గల స్కూల్ బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, టై, బెల్టులు, పలకలను అదే గ్రామానికి చెందిన బొడ్డు సత్యనారాయణ వితరణగా అందజేశారు. అనంతరం దాతను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

నోట్ పుస్తకాల పంపిణీ..

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ అరుణకుమారి, డిప్యూటీ రిజిస్ట్రార్ బాపూజీ సహకారంతో విద్యార్థులకు 600 నోట్ పుస్తకాలు అందించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాలేరు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ వీటిని అందివ్వగా.. హెచ్‌ఎంలుశ్రీనివాసరావు, రాంకోటి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మూడో రోజుకు చేరిన దీక్షలు

ఖమ్మం లీగల్/ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రం ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన కొత్త చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఖమ్మంలో న్యాయవాదులు చేపట్టిన దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో న్యాయవాదులు నాదెండ్ల వెంకటలక్ష్మి, వనం కృష్ణవేణి, పి.శ్రీలక్ష్మి, లత, గిరిజ, బిల్లా క్రాంతికుమారి, టి.లలిత, డి.కల్యాణి, ఆశ, దుర్గారాణి, కనకదుర్గ, పూర్ణిమ, ప్రమీల కూర్చున్నారు. కాగా, దీక్షకు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో పాటు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర ఉపేంద్ర సాహు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెరుకుపల్లి నాగేశ్వరావు, మిరియాల నాగరాజు, నాయకులు వేర్వేరుగా సందర్భాల్లో సంఘీభావం తెలిపారు. తదితరులు సంఘీభావం తెలిపారు. న్యాయవాదులు మందడపు శ్రీనివాసరావు, ఏడునూతల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, బిచ్చాల తిరుమలరావు, ఓరుగంటి శేషగిరిరావు, చింతల వెంకట్, పఠాన్ అమీర్‌ఖాన్, పి.దానయ్య, ఆర్.పావెల్, ఆకుల శేఖర్‌బాబు, మేకల సుగుణరావు, వెంకియా, మీసాల వెంకటేశ్వరరావు, పొట్లపల్లి విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

5జీ సేవలను ప్రారంభించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: సామాన్య ప్రజలకు తక్కువ ధరతో చౌకగా ఉండేలా బీఎస్ఎన్ఎల్ సంస్థ 4జీ, 5జీ సేవలను వెంటనే ప్రారంభించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ.నాగేశ్వరావు, సునిల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రముఖ టెలికాం కంపెనీలు తమ తారీఫ్‌లను భారీగా పెంచినా.. బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రైవేట్ కంపెనీల ప్రయోజనాల కోసం 4జీ, 5జీ సేవలను ప్రభుత్వం అడుగడుగున అనేక అడ్డంగులు సృష్టించిందని ఆరోపించారు. ఫలితంగా ప్రైవేట్ కంపెనీల ఏకపక్ష తారీఫ్ పెంపుదలను అరికట్టడంలో విఫలమైందన్నారు. ఇకనైనా హై స్పీడ్ డేటా సేవలను త్వరగా వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

విద్యార్థినికి సత్కారం

కూసుమంచి: మండలంలోని గంగబండతండాకు చెందిన బానోత్ నవ్య ఐఐటీ బాంబేలో సీటు సాధించగా.. శుక్రవారం ఆమెను కెనరా బ్యాంక్ మేనేజర్ నరేంద్ర, అసిస్టెంట్ మేనేజర్ రాజు సత్కరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ తరపు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నవ్య 8, 9, 10 తరగతుల్లో తమ బ్యాంక్ ద్వారా మెరిట్ స్కాలర్‌షిప్ అందుకుందని, అదే స్ఫూర్తితో చదివి ఐఐటీలో సీటు సాధించడం అభినందనీయమని బ్యాంక్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారి గౌరీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

9న సీత్లా భవానీ వేడుకలు

ఖమ్మంఅర్బన్: బంజారాల గిరిజనుల మొదటి పండుగ అయిన ప్రకృతి సీత్లా పండగను ఈ నెల 9న నిర్వహించుచున్నట్లు అఖిల భారత గిరిజన సమాఖ్య సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బానోత్ గోపీనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు సమృద్ధిగా పండాలని, పాడిపంటలు మంచిగా ఉండాలని రాష్ట్ర వ్యాప్తంగా వైభవంగా జరుపుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వీడాలి

కామేపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వీడాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో వానాకాలంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది సహకారంతో గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపర్చాలన్నారు. అంతేకాక మురుగునీరు నిల్వలేకుండా చూడాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు, తీగలుంటే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఏఈ శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన, ఏఓ తారాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కామేపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీందర్

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి..

తిరుమలాయపాలెం: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ.. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ఎంపీడీఓ శేషాద్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు గత ఆరు నెలలుగా నిధులు మంజూరు చేయకపోవడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందని, వానాకాలం సీజన్ ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల బారిన పడకముందే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు వెంటనే మంజూరు చేసి గ్రామాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొమ్ము నాగేశ్వరరావు, శంకర్, ఏపూరి నరేష్ వీరబాబు, ఎస్.వీరబాబు, వెంకటేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కూసుమంచి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, మెడికల్ సిబ్బంది ఎప్పటికప్పుడు వ్యాధులు సోకిన వారిని గుర్తించి చికిత్స అందించాలని ఆదేశించారు.

సమష్టిగా చర్యలు తీసుకోవాలి..

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యాన నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సమష్టిగా చర్యలు తీసుకోవాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం కేఎంసీ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యులు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు, అంగన్‌వాడీలు, ఆశలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన మందులు స్ప్రే చేయాలని, నిల్వ నీరు లేకుండా చూడాలని, డ్రైడే తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఈ కృష్ణాలాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.